


# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

**వాళ్ళ సంసారం** డబ్బు అనే ప్రవాహంలో కొట్టుకుపోతూంది. వాళ్ళ స్త్రీలకి పనిపాటలు లేవు. ఎవరి అభిరుచి ప్రకారం వాళ్ళు సింగారించుకుని స్నేహితులతో కార్లమీద తిరుగుతూంటారు. వాళ్ళకి ధాన్యం దంపాలనిగాని, బియ్యం వండాలని గాని తెలీదు. అన్నం ఒకటే తెలుసు, వడ్డించిన విస్తరివంటి జీవితం అంటే అదే అనిపించింది.

సేన్ అన్నలు, తల్లి, చెల్లెలు నాకు వంగ సాహిత్యంతో వున్న పరిచయానికి చాలా ఆశ్చర్యపోయారు. యుద్ధానికి పూర్వం వాళ్ళు "మెద్రాసీ"ల్ని చూళ్ళేదు. చరిత్ర పాఠాల్లో దక్కను ప్రజల్ని ద్రావిళ్ళంటారని, వాళ్ళు నల్లగా, పొట్టిగా వుంటారని, ఆర్యులు ద్రావిళ్ళని దక్షిణానికి తరిమికొట్టేరని చదువుకున్నారు. నేను నల్లగా లేను. ఇంగ్లీషు బాగానే మాట్లాడుతున్నా, హిందీ వచ్చు, బెంగాలీ కూడ దడ దడ మాట్లాడేస్తున్నా. ఇదంతా వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. నేనంటే చాలా గౌరవ భావం కూడా కలిగింది.

"మీ సంస్థకి “రంగూన్ ట్రేడింగ్ కో" అని పేరెందుకు పెట్టారు?” అని అడిగాను.

"మొదట మా నాన్నగారు వ్యాపారం బర్మాలోనే ఆరంభించేరు. అది చాలా పెద్ద సంస్థ. బర్మా వాళ్ళు భారతీయుల మీద కత్తికట్టి, వాళ్ళని దేశం నుంచి తరిమివేసేరు. భారతీయ వ్యాపార సంస్థల్ని దోపిడీ చేశారు. గొప్ప విధ్వంసకాండ జరిపేరు. అప్పుడు బర్మాలో దశాబ్దాల తరబడి స్థిరనివాసం యేర్పరుచుకున్న యెన్నో భారతీయ కుటుంబాలు దేవుడా అని మాతృదేశం దారి పట్టేయి. ఆ గొడవలో మా సంస్థ కూడా దెబ్బతింది. రంగూన్లో మా వ్యాపారం చిన్నన్నయ్య నడిపేవాడు. మొదట అతనా ఒత్తిడిని నిభాయించుకొని అక్కడ వుండడానికి ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది, బంగారం, వెండి కొన్ని విలువైన వస్తువులు కూడగట్టుకొని కుటుంబంతో సహా విమానంలో ప్రయాణంచేసి యిక్కడికి చేరుకున్నాడు.”

“అయితే మీ వ్యాపారం అంతా మీ నాన్నగారు స్వయంగా పెంపొందించిందే...”

“ఔను. అంతేకాదు. మా తాతగారి హయాంలో మాది మధ్య తరగతి కుటుంబమే. ఇదంతా మా నాన్నగారి స్వార్జితం. తరవాత అన్నయ్యలు ఈ సంస్థని అభివృద్ధి చేస్తున్నారు.”

“మీ తండ్రిగారికి అన్నదమ్ములున్నారా...”

“ఒక తమ్ముడుండేవాడు.”

“ఎక్కడ?”

“కామిల్లాలో, మా పిత్రార్జితపు యింట్లో. ఆ యిల్లు మేం వాళ్ళ కొదిలేశాం”

“ఆయన పోయి యెన్నాళ్ళయింది...”

“ఏదీ... కొన్ని నెలలే. పాపం ఆయనికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కొడుకు”.

నాకేదో మనస్సులో పీకినట్టయింది. కొంపతీసి ఆ చనిపోయినది పద్మ తండ్రి కాదు కదా!

సేన్ యేదో పనిమీద లోపలికెళ్ళేడు. అక్కడికా సంభాషణ ఆగిపోయింది. తరవాత అతని కారుమీద నన్ను యూనిట్ కి దిగబెట్టేడు.

చిట్టగాంగ్ లో ఆకలి చావులకి కొదవలేదు. ఐశ్వర్యంతో తులతూగుతున్న "రంగూన్ ట్రేడింగుకో" కెదురుగుండానే పెవ్మెంటు మీద ప్రతిరోజు కనీసం రెండు శవాలుండేవి. ప్రజలు వాటిని పగటిపూట చచ్చిన కుక్కల్నిలాగే తప్పుకు పోయేవారు. రాత్రి చీకట్లో వాటిని మట్టుకుని పోయేవారు.

మా యూనిటు కెదురుగా ఒక కాంటీనుంది. అది ఒక బెంగాలీది. అతను టీ, పకోడీలు అమ్మేవాడు. మా సిపాయిలక్కడ ఖాతాలు పెట్టేరు.

అరకాన్ రోడ్డువేపు మా యూనిటు పొడుగునా ముళ్ళతీగల కంచెవుంది. ఆకంచెకి సమీపంలోనే తెల్లసోల్జర్ల మెస్సు, స్టోరుగది వున్నాయి.

ఓ నాడు సాయంత్రం యేడు గంటలకి తెల్లసోల్జర్ల మెస్సు పక్కనించి కంచె మీదుగా, రోడ్డుకవతలున్న ఆ కాంటీనులోకి రెండు బస్తాలు తరలించ బడుతుండగా మా సార్జంటు మేజరు చూసేడు. అక్కడ చీకటిగా వుంది. బస్తాలు యెవరు మోసుకెళ్ళేరో సరిగా పోల్తి ఆనలేదు.

సార్జంటుమేజర్ ఈ సంగతి వెంటనే మరో యిద్దరు ముగ్గురు సార్జంట్లతో ప్రస్తావించేడు. తక్షణం కాంటీన్ సోదా చేసేరు. సోదాలో నాల్గు బస్తాల బియ్యం, రెండు బస్తాల పంచదార, సుమారు వంద పాలడబ్బాలు వగైరా బైటపడ్డాయి. సార్జెంటు మేజరు వాటన్నిటినీ స్వాధీనపర్చుకున్నాడు. కాంటీను యాజమానిని, ఆఫీసర్ల మెస్ లో ఓ.సీ. ముందు హాజరు పెట్టేరు. ఓ.సీ. అతన్ని నిలదీసి అడిగేడు. అతను గజ గజలాడిపోయాడు. ఆ సరుకులు సార్జంట్ల మెస్ వెయిటరు మనిరుజ్జమాన్ యిచ్చేడని చెప్పేడు. అలా చాలా కాలంనించీ యిస్తున్నాడని, అవి తను కొనుక్కుంటున్నానని చెప్పేడు.

వెంటనే ఓ.సీ. మనిరుజ్జమాన్ని పిలిపించేడు. మనిరుజ్జమాను హడలిపోయి, యింకోలా చెప్పి లాభం లేదని, నేరం ఒప్పుకున్నాడు. అతన్ని తక్షణం గార్డురూములో బంధించేరు.

నాకీ గొడవేం తెలీదు. నేనిది జరుగుతున్నప్పు డక్కడలేను, ఊళ్ళోకెళ్ళా. తిరిగొచ్చేసరికి రాత్రి పది దాటింది.

మర్నాడుదయం లేవగానే సంగతంతా తెలిసింది. నాకు నమ్మకం లేకపోయింది. మనిరుజ్జమాన్ స్వతహాగా అమాయకుడు. అంతపని చెయ్యలేడు. ఇందులో ఏదో రహస్య ముందనిపించింది. నీళ్ళు పోసుకుని "బ్రేక్ ఫాస్ట్" త్వరగా ముగించి గార్డు రూముకెళ్ళా. మనిరుజ్జమాన్ దిగాలుపడి వున్నాడు. నన్ను చూడగానే లేచి సలాంచేసేడు. నేను గార్డు, కమాండర్ని, యితర గార్డుల్ని బైటికి వెళ్ళమన్నాను.

"మనిరుజ్జమాన్, నువ్వు నిజంగా దొంగతనం చేశావా?"

అతను తలవంచుకుని "ఔను సాబ్" అన్నాడు.

"నేను నమ్మను. నిజం చెప్పు..."

"నిజం సాబ్" అతడు మళ్ళీ తలొంచుకునే అన్నాడు.

"''దేవుడు సాక్షిగా? ఖురాన్ సాక్షిగా?"

అతను కొంచెం ఆలోచించి "హాఁ సాబ్." అని కన్నీళ్లు పెట్టుకు అన్నాడు.

"చూడు మనిరుజ్జమాన్! నువ్వు ఘోరమైన ప్రమాణం చేసి కూడా అబద్ధం చెప్తున్నావనే నాకు తోస్తూంది. ఏం?"

అతను చంటి పిల్లాళ్లా యేడుస్తున్నాడు.

"సాబ్! నన్నిలా వుండనీ. నా బతుకు ఎలాగూ ధ్వంసమైంది. నేను నిజం చెప్పినా ఎవరు నమ్ముతారు? నాకు జైలు తప్పదు, నాగురించి నాకు బెంగలేదు. కాని నాకు ముగ్గురు భార్యలు. పదిమంది పిల్లలున్నారు. వాళ్ళ గురించే దిగులుగా వుంది. కాని నావూసు పట్టించుకోకు సాబ్..."

"చూడు మనిరుజ్జమాన్! దొంగతనం చేసేనని నువ్వప్పుడే ఓ.సీ. దగ్గిర ఒప్పుకున్నావు. ఇక చేసేదేం లేదు. అయినా నువ్వు దొంగతనం చెయ్యలేదని నాకు తోస్తూంది, నిజం నాతో చెప్పు..."

అతను కన్నీళ్ళతో తల జోరుగా త్రిప్పుతూ "లాభంలేదు సాబ్, నన్నట్టే బాధపెట్టకు, నాపనైపోయింది" అని కూలబడ్డాడు.

"భయపడకు, నాకు నిజం చెప్పు, నీకు మేలు చెయ్యగలనని నా మనస్సుకి గట్టిగా తోచినప్పుడే నువ్వు చెప్పినదాన్ని నే వుపయోగిస్తా. అది బైట పెట్టినందు వల్ల నీకు మేలు జరగదు సరి కదా, పైగా అపకారం జరుగుతుందనిపిస్తే, నువ్వు చెప్పింది నా ప్రాణం వున్నంత వరకూ ఎక్కడా బైట పెట్టను, అల్లా తోడు"

మనిరుజ్జమాన్ దీర్ఘాలోచనలో పడ్డాడు.

"నువ్వొకసారి దేవుడు తోడుగా, ఖురాన్ తోడుగా పచ్చి అబద్ధం చెప్పేవు. ఇంకొక అవకాశం యిస్తున్నా. ఈసారి దేవుడు తోడుగా ఖురాన్ తోడుగా నిజం చెప్పు. నా మాటనేను నిలబెట్టుకుంటా..." అతని చేతిలో చెయ్యేసి అన్నా...

మనిరుజ్జమాన్ నిట్టూర్చేడు,

"సాబ్! నిజం చెప్తున్నా, రక్షించినా, చంపినా నీ దయ. ఆ సరుకులు నేను దొంగతనం చెయ్యలేదు. తెల్లవాడు చేసేడు. తెల్లవాళ్ళ రేషన్ స్టోర్సు యజమాని ప్రైవేటు మూరు చేసేడు. నేను చేసింది నిజానికి కూలిపని. అదైనా తీగెదడి కవతల్నించే. దడివరకూ ఆ మూర్ గాడే మోసి దడి మీంచి 'నా కందిచ్చేడు, ఇది చాలాకాలం నించీ జరుగుతూంది. కాంటీనువాడు తెల్లవాడి మీద చెప్పడానికి గుండెల్లేక నా మీద పెట్టేడీ నింద, ఇది నిజం సాబ్..."

నేను నిజం తెలుసుకుని సంతోషించాను.

"ఇది నిజం మనిరుజ్జమాన్. ఈ నిజం సమయం వచ్చినప్పుడు, యెక్కడ "నీకు చెప్పవలసొచ్చినా, యెన్నిసార్లు చెప్పవలసొచ్చినా జంకు లేకుండా చెప్పు. దీనిమీద యెన్నో వందల వేల ప్రశ్నలొస్తాయి. ప్రతి ప్రశ్నకీ నిజమైన జవాబే చెప్పు. ఒక అబద్ధం చెపితే, దానికోసం వంద అబద్ధాలాడవలసొస్తుంది. జాగ్రత్త.... నీకే ప్రమాదం రాదు..."

"సాబ్! నీదయ. అంతా నీదే భారం. పిల్లల వాణ్ని..."

"ఫరవాలేదు..."

నేను నా బాషాకి తిరిగొచ్చి సిగరెట్టు ముట్టించి ఆలోచించా. నిజం తెలిసింది, కాని యికమీద ఏంచెయ్యాలి. ఈ నిజాన్ని ఎలా బైట పెట్టడం? ఒక తెల్లవాడి మీద యింత నేరం ఆరోపించడం సామాన్యం కాదు. తెల్లవాళ్లంతా యేకమైపోవచ్చు. నిజం బైట పెట్టకపోతే ఒక అమాయకుడికి అన్యాయంగా నాలుగైదేళ్ళు కఠిన ఖైదు శిక్ష పడుతుంది. చివరికి తెగించాను.

ఎనిమిదైంది. ఆఫీసు వేళకింకా అరగంట వ్యవధుంది. తిన్నగా ఆఫీసర్ల మెస్సుకి వెళ్ళా. అక్కడ మా ముగ్గురు ఆఫీసర్లు బ్రేక్ ఫాస్ట్ తీసుకుంటున్నారు. నన్ను చూడగానే రమ్మన్నారు.

"ఏమిటి సంగతి?" నవ్వుతూ అన్నాడు ఓ.సీ.

మెస్సు వెయిటరు నాకు కాఫీ యిచ్చేడు. తాగుతూ సిగరెట్టు ముట్టించా.

"ఒక అద్భుతమైన విషయం చెప్పడానికొచ్చా..."

టెలికమ్యూనికేషన్సు ఆఫీసరు నా వంక చూసి ముసిముసి నవ్వు నవ్వేడు. అది అతనికలవాటు. ఓ.సీ. ప్రశ్నార్థకంగా చూసేడు. "మీరెవ్వరూ నన్నపార్థం చేసుకోకూడదు, అలా హామీయిస్తే చెప్తా..."

"అపార్థం యెందుకు... కానీ..." ఓ.సీ.

"నిన్న సాయంత్రం మన యూనిట్లో ఒక దొంగతనం జరిగింది..."

"ఔను, మనిరుజ్జమాన్ చేసేడు. ఇవాళ ఆ కేసు తయారుచేసి అడ్జటంటుతో మాట్లాడాలి."

'క్షమించండి. అక్కడే వుంది సంగతంతా... ఆ దొంగతనం మనిరుజ్జమాన్ చెయ్యలేదు..."

"మరి!" ఓ.సీ. ఆశ్చర్యపోతూ అన్నాడు.

"ప్రైవేట్ మూర్..."

"క్రిస్టోఫర్ కొలంబస్!" ఓ.సీ. అదిరిపడ్డాడు. అతనితో బాటు మిగిలిన యిద్దరూ వులిక్కి పడ్డారు. నా మీద విరుచుకు పడతారనిపించింది. నేనూ సిద్ధంగా వున్నా, ఓ.సీ. కాఫీముగించి, పైపు ముట్టించి "హవల్దార్" అన్నాడు గంభీరంగా.

"నాకనుమానం లేకపోలేదు. మనిరుజ్జమాన్ మంచివాడు, అంత పని చెయ్యలేదు...." అని వూరుకున్నాడు. నేను మనిరుజ్జమాన్ దగ్గరికి వెళ్ళిన దగ్గరనించి జరిగిందంతా వివరంగా చెప్పా.

"మాటకి మనం ప్రైవేట్ మూర్ ని అరెస్టు చేస్తాం అనుకో. మన గార్డురూంలో పెట్టలేమనుకుంటా..." ఓ.సీ. అన్నాడు.

"అతన్ని ఆర్.హెచ్.క్యూకి పంపిద్దాం."

"'రైట్..." .

వెంటనే ఓ.సీ. ఫోన్ తీసి ఈ విషయమంతా అడ్డటంటుతో పూస గుచ్చినట్టు చెప్పేడు. ఫోన్ "రింగాఫ్" చేసి సార్జెంట్ల మెస్ కి ఫోన్ చేసేడు.

"సార్జంట్ మేజర్! నేను ఓ.సీ.ని?"

.............................................

"ఇద్దరు సార్జంట్లతో సహా ప్రైవేట్ మూర్ ని నువ్వు స్వయంగా యిక్కడికి తీసుకురా"

..............................................

"ఔను, తక్షణం"

............................................

"ఆఫీసుక్కాదు. నా మెస్సుకే"

............................................

"ఒద్దొద్దు, నువ్వేం చెప్పకు, ఉన్నపళంగా రమ్మన్నానని చెప్పు, వేగం."

నేను గార్డురూంకి పరుగెత్తి రెండు రైఫిళ్ళు తెచ్చా. నే వొచ్చేసరికంతా వున్నారు.

"ప్రైవేట్ మూర్!" ఓ.సీ. గద్దించాడు.

"ఎస్, సర్..."

"నువ్వు సార్జంట్ల మెస్ కి చెందిన స్టోర్సులోంచి బియ్యం, పంచదార, పాలడబ్బాలు నిన్న సాయంత్రం సుమారేడు గంటలకి దొంగతనం చేసి, ఒక సివిలియన్ కాంటీను కమ్మేవు..."

"నో సర్..."

"షటప్! నీ మీద కేసు జరుగుతుంది. నువ్వు అరెస్టు చెయ్యబడ్డావు... సార్జంట్ మేజర్! ఇతన్ని బైటకి మార్చిచెయ్యి... వెంటనే ఆర్.హెచ్.క్యూకి తీసుకెళ్ళి అప్పజెప్పు..."

"యస్, సర్"

ఇద్దరు సార్జంట్లు ఖైదీకి రెండు ప్రక్కలా రైఫిళ్ళతో తయారయ్యారు.

"ప్రిజనర్ అండ్ ఎస్కార్ట్స్" సార్జంట్ మేజరు అన్నాడు.

"అటేన్...షన్........ క్విక్ మార్చ్... లెఫ్ట్, రైట్, లెఫ్ట్, రైట్..."

వాళ్ళు వెళ్ళిపోయాక ఓ.సీ. నాతో కరచాలనం చేసేడు.

"బ్రుందింది. నేను చాలా సంతోషిస్తున్నా."

ప్రైవేట్ మూర్ అరెస్టయిన వార్త క్షణంలో యూనిటంతా పాకిపోయింది.

అది ఒక పెద్ద ఫీల్డు. జనరల్ కోర్టు మార్షల్ కేసు, ప్రోసిక్యూషన్ పక్షం, డిఫెన్సు పక్షం ఎందరో సాక్షులు. చచ్చినంత తంతు. మూరుకి మూడేళ్ళు కఠినశిక్ష పడింది. మనిరుజ్జమాన్ని విడిచి పెట్టేరు.

12

నాకు అతి సన్నిహితులైన మిత్రుల్లో లహరీ ఒకడు. మేం అగర్తలాలో వుండగా అతనొచ్చాడు. అప్పటికి ఓ.సీ. నలుగురు తెల్లవాళ్ళు, పాతికమంది భారతీయ సైనికులు వచ్చారు. మాది వర్కుషాపు కావడం చేత అంతా వృత్తి పనివాళ్ళు. మేము భోజనం, క్రమశిక్షణ మొదలైన వాటికి ఆర్. హెచ్.క్యూకి అనుబంధించబడి వున్నాం. ఆఫీసులో రెండే సీట్లు. ఒకటి ఓ.సీ.ది. రెండోది నాది. వర్కుషాపుకి సంబంధించిన యంత్రాలు, పనిముట్లు ఉండవలసినన్ని ట్రక్కులు యింకా లేవు. అంచేత మా సిపాయిలు గార్డు, లంగరు (వంట), రేషన్లు తీసుకురావడం, తవ్వడం, నీళ్ళు మొయ్యడం మొదలైన సామాన్యవైన పన్లు చేస్తున్నారు. లంగరు డ్యూటీలో కఱ్ఱలు చీరవలసికూడా వస్తుంది.

లహరీ ఒక వుదయం పదిగంటలకి ఆఫీసులో కొచ్చి ఓ.సీ.కి సెల్యూట్ చేశాడు.

"నా పేరు లహరీ. నేను ఇన్ స్ట్రుమెంటు మెకానిక్కుని, కిర్కీ నుంచి వచ్చా..."

ఓ.సీ. అతన్ని ఎగా దిగా చూశాడు. అతని కాయితాలు చూశాడు. లహరీ హోదా సిపాయి, మూడో గ్రేడు వాడు.

"బ్రేక్ ఫాస్ట్ తీసుకున్నావా?" ఓ.సీ. అడిగాడు.

"లేదు సర్. ఇదే రావడం. ఇంకా నీళ్లైనా పోసుకోలేదు!"

"సరే వెళ్ళి స్నానం పానం చేసి కొంత విశ్రాంతి తీసుకో. మూడు గంటలకి ఆఫీసుకి రా..."

"యస్ సర్"

"ఆర్డర్లీ...!" అని పిలిచాను.

ఉర్ఫాన్ వచ్చాడు.

"ఇతన్ని తీసుకెళ్ళు..."

"అచ్ఛా సాబ్..."

లహరీ సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

"ఈ కుర్రాడు మంచి హుషారు, తెలివిగల వాళ్లా వున్నాడు." ఓ.సీ. అన్నాడు.

"అలాగే ఔపిస్తున్నాడు."

"ఇంకా వర్కుషాపు పనిలేదు. అందాకా యితనేం చేస్తాడు?"

నేను క్షణం ఆలోచించా. అతన్ని సిపాయిల లైన్లలో తోసేస్తే కర్రలు కొట్టడం పనికూడా వంతు వారీగా చెయ్యవలసొస్తుంది. కుర్రాడు చిక్కితే పాలుగారినట్టున్నాడు. అందంగా వున్నాడు. మెట్రిక్కు ప్యాసయాడు, అసలు వర్కుషాపు పని ఆరంభమయ్యే వరకూ అతనికి మోటుపన్లు తగలకుండా చూడాలి. నేనెలా ఆలోచిస్తున్నానో, ఓ.సీ. కూడా అలాగే ఆలోచిస్తూండాలి.

"మన వర్కుషాపులు తయారయేవరకూ లహరీని ఆఫీసు పనిలో పెడితే..."

"ఆఫీసులో ఏం జేస్తాడు! అతను వృత్తి పనివాడు. ఆఫీసు పని అతనికి నచ్చదేమో! తెలీదేమో..."

నా సైనిక జీవితంలో ఒక విశేషం చూశాను. కమ్మరి, కుమ్మరి వంటి సామాన్య కార్మికుడు మొదలు, పెద్ద ఇంజనీరు వరకూ చేతిలో పనివున్న ఏ తెల్లవాడూ, ఆఫీసులో పడి కాయితాల్లో పొర్లుతూండడాని కిష్టపడడు. కాలూ చెయ్యి బావున్న మగాడికి ఆఫీసులో గుమాస్తా గానో, టైపిస్టుగానో పన్జెయ్యడం అంటే అసహ్యం, నామోషి. ఆ పన్లు స్త్రీలు, తప్పితే అంగలోపం వున్న మగవాళ్ళు చెయ్యాలి. గంటల కొద్దీ ట్రక్కుల కింద వెల్లకిలా పడుకుని పనిచేసేవాడిని, లేతు యంత్రం మీద పనిచేసే వాడిని గన్నులు, రేడియోలు, వాచీలు, మీటర్లు, మెగ్గర్లు, మొదలైనవి బాగుచేసేవాడిని; ఆఫీసులో పన్జెయ్యమంటే ససేమిరా ఒప్పుకోడు. మగాడు యంత్రాలు తయారు చెయ్యాలి, నడపాలి. బాగుచెయ్యాలి, ఉత్పత్తి చెయ్యాలి. అది వాళ్ళ నమ్మకం. ఈ విశ్వాసం, చైతన్యం వాళ్ళలో యుద్ధం టైములో మరీ యెక్కువైంది. యుద్ధం ముగిసిన వెంటనే ఇంగ్లండులో గుమాస్తాల ప్రభుత్వం పతనమై, లేబరు పార్టీ గద్దెనెక్కడానికి ఈ చైతన్యమే కారణం అని నా కనిపిస్తున్నది.

"నాకు యిండెంట్ల పనెక్కువైంది. అంచేత లహరీ నాకు సాయంగా వుంటాడు. ఉత్తరాలు డిస్పాచి చేస్తాడు."

ఓ.సీ. మీసంలో వెంట్రుకలు లాక్కుంటూ ముసి ముసి నవ్వు నవ్వేడు.

"ఓ కే. నీ యిష్టం ."

అప్పటి నించీ లహరీ ఆఫీసులో నా తోటే వున్నాడు. క్రమేణా వర్కుషాపులు తయారయేయి. అతను తన పనిలోకి వెళ్ళిపోయేడు. నా పలుకుబడి వుపయోగించి క్రమేణా అతని హోదా పెరిగేలా చేసేను. మేం చిట్టగాంగు వచ్చేసరికి అతను "హవల్దార్ ఇన్ స్ట్రుమెంటు మెకానిక్ గ్రేడ్ వన్" అయేడు. నా అభిమతం సిద్ధించింది.

ఒక సాయంత్రం లహరీ ఒక తొమ్మిదేళ్ళ కుర్రాణ్ని తీసుకొచ్చాడు. నేనప్పుడు మెస్సులో టీ తాగుతున్నా.

"రావ్! చూడీ కుర్రాణ్ణి...చికో అంటారు ముద్దుగా."

నేను పరికించి చూశా. ఎక్కడో చూసిన మొహంలా వుంది. కాని జ్ఞాపకం రాలేదు.

"వీళ్ళది చాలా బీద కుటుంబం. ఇతన్ని మన మెస్సులో వుంచుదామా? ఈ పనీ ఆ పనీ చేస్తాడు."

కుర్రాడు సన్నగా వున్నాడు. అంచేత కాస్త పొడుగ్గా అవుపిస్తున్నాడు. ఉంగరాల జుత్తు.

"నీ పేరేమిటి?"

"అషూ..."

ఈ వూరేనా.

"కాదు. కొమిల్లా...."

"మీ తండ్రేంజేస్తున్నాడు?"

"ఇతనికి తలిదండ్రుల్లేరు. అక్కలున్నారు. చాలా బీదవాళ్ళు, మనమెస్సులో వెయిటరుగా వేస్తే? ఇక్కడే తిండి తింటాడు... రావ్, ఎలాగైనా నువ్వీ కుర్రాడికి నౌఖరీ యిస్తే, మగదిక్కులేని వాళ్ళ కుటుంబానికి కనీసం వీడి భారం తగ్గుతుంది." లహరీ బతిమాలేడు.

"అది సరే, వీడిక్కడేదో పనిజేస్తాడు. మనతో బాటు తింటాడు, కాని వాళ్ళ కుటుంబానికేం ప్రయోజనం?"

"పరవాలేదు. ఒకడి తిండిభారం తగ్గుతుంది కదా..."

నే నాలోచించా...

"ఇల్లు దూరమా?" అన్నాను.

"పావుగంట నడక. రోజూ పొద్దున్నే ఆరుగంటల కొస్తాడు. రాత్రి ఎనిమిదికి వెళ్ళిపోతాడు. ఎప్పుడైనా రాత్రి వుండి పొమ్మంటే వుండి పోతాడు..." అన్నాడు లహరీ.

"ఏం చికో?"

"అలాగేనండి..."

"రోజుకి రూపాయిద్దాం. పైగా యేదో ముట్ట చెపుతూంటాం కదా..."

"చాలా బావుంది..." లహరీ సంతోషించాడు

"జీతం నెలకొక సారే యిద్దాం ..."

"అవును."

"జీతం యితనికిస్తే పారేస్తాడేమో... ఖర్చు పెట్టేస్తాడేమో"

"పరవాలేదు. నువ్వు ఆఫీసు నించి ముప్పైరూపాయిలిస్తే, మనం దానికైదో పదో కలుపుదాం. మొత్తం వాళ్ళింట్లో నేనిచ్చేస్తా..."

"ఎవరికిస్తావు?"

"వాళ్ళ పెద్దక్క అంటే రెండో అక్క, ఇక్కడున్న వాళ్ళలో ఆవిడే పెద్దది".

"చాలా పెద్దదా?"

"ఔను."

"నలభై యేళ్ళుంటాయా?"

లహరీ తడబడ్డాడు.

"లేదు లేదు... చిన్నదే..."

"పదకొండేళ్ళుంటాయా?"

"నన్ను ఫూల్ చేస్తున్నావా"

అయోమయంగా నవ్వాడు.

"గాభరాపడకు. నేను ఆఫీసు వాణ్ణి. వివరాలు తెలీకుండా యెలా?"

"ఆవిడకి యిరవై యేళ్ళుంటాయి. ఉద్యోగం చేస్తూంది"

"ఆవిడ నీకెలా తెలుసు?"

"రావ్! లాయర్లా పట్టుకుని చిత్రవధ చేస్తున్నావు. నీకూ నాకూ మధ్య దాపరికాల్లేవు. అంతా చెప్తా."

చికో యెప్పుడూ మా మెస్సులో లింగూ లింగూ తిరుగుతూండే వాడు. మెస్సు నీటుగా వుంచేవాడు. టేబిలు మీద ప్లేట్లు కప్పులు సర్దేవాడు. మా జోళ్ళు జిగ్ జిగ్ మెరిసేలా పాలిష్ చెయ్యడమంటే అతనికి సరదా. ఏదో వన్దేస్తున్నాంకదా, డబ్బు సంపాదిస్తున్నాంకదా అని తృప్తి. కాని నేను జోళ్ళు తుడవద్దన్నా.

తొమ్మిదేళ్ళ చికో తల్లిదండ్రుల దగ్గర ముద్దుగా పెరుగుతూ, చక్కగా బడికెళ్ళి చదువుకోవలసినవాడు. మెస్సు వెయిటరు పనిచేస్తున్నాడంటే నాకాశ్చర్యం కలగలేదు. అక్కడ బీద కుటుంబాల్లో యేడెనిమిదేళ్ళ కుర్రాళ్లు కూడా పనేజేస్తారు. పనిరాకపోతే ముష్టి, "సాయబ్! బోస్కీస్!" ఎవరి ఆకలి తీర్చుకోవలసిన బాధ్యత వాళ్ళదే, వయోభేదం, లింగభేదం లేదు.

## 13

నేను చిట్టగాంగు చేరిన. కొద్ది నెలల్లోనే "పూజా" రోజులొచ్చాయి. బెంగాల్లో దుర్గ పూజ చాలా వైభవంగా జరుగుతుంది. నెల రోజులు ముందు నుంచీ ప్రయత్నాలారంభమవుతాయి.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచీ పూజ ఆరంభమవుతుంది. ఇంటింటా దుర్గపూజలు చేస్తారు. ప్రతి వీథిలో కనీసం ఒక మందిరమైనా వుంటుంది.

కలకత్తాలో పూజా వుత్సవాలు చూశాను. చిట్టగాంగు తూర్పు బెంగాలు సరిహద్దు జిల్లా. ఇప్పుడు యుద్ధం ముమ్మరంగా తూర్పు రంగంలోనే సాగుతూంది. అంతవరకూ శత్రువుల వశంలో వున్న ఇంఫాల్, “కాక్సస్ బజార్” రామూ మొదలైన అతి సమీప ప్రదేశాలు తిరిగి మిత్రమండలి వశమయాయి. యుద్ధపు హడావుడితో చిట్టగాంగు ప్రాంతం చముురు కళ పెళ్ళాడుతూన్న కళాయిలా వుంది. ఇక్కడ పూజా సంబరాలుండవనుకున్నా.

కాని నా అంచనా తప్పింది. పాడ్యమి దగ్గర్నించీ వూరు స్వరూపం మారిపోయింది. వీధికి రెండు మూడు పూజా మందిరాలు లేచేయి.

ఇది నిన్న మొన్నటివరకూ వున్న వూరేనా? పగలంతా ఆలివ్ ఆకుపచ్చతో నిండిపోయి, సంజపడితే మందకొడిగా వుండి, ఆరు దాటగానే నవచైతన్యం పుంజుకుంటూంది. లెక్క లేనన్ని కరెంట్ దీపాలతో వీథులు కలకల్లాడుతున్నాయి. జన సంచారం అప్పుడే ఆరంభమై, రాత్రి పడుతూన్న కొద్దీ యెక్కువైపోతూంది.

ఎక్కడ చూసినా సంతోషం, నవ్వులు, పలకరింపులు, కౌగిలింతలు, పరాచకాలు – “మిఠాయి తిను – మిఠాయి తినిపించు” అనే మాటలు.

ఆ స్త్రీలేమిటి? వీళ్ళంతా ఎక్కణ్ణించొచ్చేరు. మెరుపుతీగెల్లా, చిరునవ్వులతో. చక చక నడుస్తూ, ఆహ్వానిస్తూ, ఆహ్వానాలందు కొంటూ. కళ్ళు మిరుమిట్లు చేస్తున్నారు.

నాకు కొన్ని ఆహ్వానాలొచ్చాయి, అక్కడికి ప్రత్యేకంగా వెళుతున్నా. లహరీ నాతోటే వుండేవాడు. పూజ చూడ్డానికి ఆహ్వానమేమిటి? పద అనేవాడు. ప్రతిరోజూ సాయంత్రం ఏడు గంటల్నించి, తెల్లవార్లూ పూజలు చూస్తూ తిరిగే వాళ్ళం. పదిగంటల వరకూ దుర్గ విగ్రహం ముందు ధూప దీపాలతో, నృత్యగీతాలతో పూజ జరుగుతుంది. తరువాత నృత్య సంగీత నాటక ప్రదర్శనాలు, పెద్దల పర్యవేక్షణ కింద యువజనం నడిపించే ఈ సాంస్కృతిక కార్యక్రమాలు చాలా హుషారుగా వుంటాయి.

ఆ నాడు నాటకం ఆరంభమయే ముందు, ఉత్సాహం, వుత్తేజంగల యువకుడొకడు రంగస్థలం మీద తెరముందుకు వచ్చి జరగబోయే కార్యక్రమం గురించి ఒక చిన్న ఉపన్యాసం యిచ్చాడు. “మన విశ్వకవి రవి ఠాకూర్ రచించిన "చిత్రాంగద” ఈ రాత్రి ప్రదర్శించబోతున్నాం. అంతా సావధానంగా చూసి ఆనందించండి... “అదిగో చూడు!" లహరీ అటు చేత్తో చూపించబోయేడు. నేను వారించా.

“ఏమిటి?”

“ఇప్పుడలా వెళ్ళిందే అమ్మాయి...”

"ఎలా వెళ్ళింది?"

"పూజా స్థలం దగ్గర్నించి, స్టేజీ వెనగ్గా యింట్లోకి..."

"గుర్తించలేదు..."

"అదిగో చూడు మళ్ళీ బైటకొస్తూంది." స్టేజి వెనకనుంచొచ్చి వెంటనే ఎడం పక్కకి తిరిగి మరోగుమ్మం లోపలి కెళ్ళిపోయింది. బాగా గుర్తు ఆనలేదు. ప్రక్కగా ఔపించింది. తరవాత వీపు. వెంటనే మాయమైయింది.

"ఆ అమ్మా యే చికో అక్క..."

"ఎక్కడో చూసినట్టే వుంది. కాని బాగా గుర్తురావడం లేదు."

"పద. కొంచెం లోపలికెళదాం..."

"వద్దు. వీళ్ళెవరో మనకి తెలీదు"

"చికో అక్క వుందిగా..."

"అయినా, బావుండదు..."

"అదిగో అలా చూడు. నవ్వుతూ యిలా వస్తూంది. ఏం? చూశావా?"

''ఎడంపక్కకి తిరిగి స్టేజి వెనక్కి వెళ్ళిపోయింది"

"ఔను. ఈ సారి బాగా చూశాను..."

"ఆ అమ్మాయి చికో అక్క కాదు."

"మరి?"

"రామొ కృష్ణో రామో కృష్ణా" లహరీ చిలిపిగా నవ్వేడు.

నా గుండె కొట్టుకోడం నాకు వినిపించింది.

"ఈ అమ్మాయి! రామొ కృష్ణో రామొ కృష్ణా! నిటారుగా, నిమ్మళంగా, ఠీవిగా, పరిమళంతో కూడిన రివట గాలిలా వెళ్ళిపోయింది. రామొ కృష్ణో రామో కృష్ణా".

తరచు సాయంత్రం లాల్ దిఘీవేపు షికారు వెళ్లేవాడిని. "బ్లాకౌటు" కారణం వల్ల వూరు చీకటిగా వుండేది. ముఖ్యంగా లాల్ దిఘీకి వెళ్లే తోవ మరీ చీకటిగా వుండేది. జనసంచారం కూడా వుండదు. నిశ్శబ్దంగా వున్న ఆ రోడ్డంట రాత్రి పూట వొంటరిగా వెళుతూంటే సరదాగా వుంటుంది. తోవలో ఒక దగ్గర రజనిగంధ (నైటెక్వీన్) పరిమళం గుప్పుమనేది. అక్కడ మరీ చీకటి. పరిమళంతో బాటు మేడమీద సంగీతం వినిపించేది.

"రామొ కృష్ణో రామో కృష్ణా. రామొ కృష్ణో రామో కృష్ణా. రామొ కృష్ణో రామో కృష్ణా. రామో – కృష్ణా."

ఇదే వినిపించేది. తియ్యగా నిండుగా వున్న కంఠంలో శ్రుతి పక్వంగా వున్న ఆ సాధకం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నేను రజినిగంధ పక్కనే నిలబడి మైమరిచి వినేవాణ్ణి. నిద్రలో కూడా ఆ ఆలాపన వినిపించేది. ఆ గాయని యిరవై ఏళ్ళ యువతై వుంటుంది. అందంగా వుంటుందని వూహించుకున్నా, సాధారణంగా అలాంటి అంచనా తప్పుతుంది. కఠోరమైన కంఠంగల నెమలి అందాలరాణి. సాటిలేని కంఠమాధుర్యం గల కోయిల కురూపి. కాని 'రామొ కృష్ణా' విషయంలో నా ఊహ నిజమైంది. రామొకృష్ణో రామొకృష్ణా అందం అపురూపం అతిలోకం!

రజనిగంధ దగ్గిర "తీయని సంగీతం" గురించి లహరీనడిగా. అతనికా అమ్మాయితో గాని, ఆ యింట్లో వాళ్ళతో గాని పరిచయం లేదు. కాని ఆ "తీయని సంగీతం" ఫలానా అని తెలుసు. అదిగో ఆ అమ్మాయే. రామొ కృష్ణా అని లహరీ చూపించగానే నాకేదో తీయని బాధ కలిగింది.

గొప్ప చిత్రకారుడు చిత్రించిన పటంలోంచి చిరునవ్వులతో దిగివచ్చిన రసపుత్ర రమణి. మొగల్ సుందరిలా వుంది రామొకృష్ణా.

కాని ఆ రెండో అమ్మాయెవరు? ఎక్కడో చూసేను! ఎక్కడ?

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments